# సాక్షి
## శ్రీసత్యసాయి జిల్లా

ఆదివారం । 10 । ఆగస్టు । 2025






**చీనీ టన్ను రూ.15,100**

అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.15,100, కనిష్టంగా రూ.9 వేల ప్రకారం ధర పలికాయి.



**కిలో టమాట రూ.40**

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్టంగా రూ.40, కనిష్టంగా రూ.32 ప్రకారం ధర పలికింది. మార్కెట్‌కు 3,225 టన్నుల టమాట వచ్చింది.

గరిష్టం/కనిష్టం
**34.4°/21.3°**

జిల్లాలో శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 12 కి.మీ వేగంతో గాలి వీచింది.

## న్యూస్‌రీల్

### ఆదివాసీలు సమాజానికే ఆదర్శం

- జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

**గోరంట్ల:** సంప్రదాయాలను కాపాడుకుంటూ జీవనం సాగించే ఆదివాసీలు సమాజానికి ఆదర్శమని జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ అన్నారు. ఆదివాసీల అరుదైన సంప్రదాయాలను రాబోయే తరాలకు అందించాల్సిన బాధ్యత ఉందన్నారు. శనివారం గోరంట్ల ప్రభుత్వ గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ మాట్లాడుతూ... ఆదివాసీలు ప్రకృతితో కలిసి జీవనం సాగిస్తారన్నారు. ఆదివాసీల భాష, సంప్రదాయ నృత్యం , వ్యవసాయ పద్ధతులు వంటి వాటిని రాబోయే తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. స్వాతంత్ర్య సమరంలో బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన తొలి వీరులు గిరిజనులేనని జేసీ గుర్తు చేశారు. అందువల్లే మిగతా వర్గాలతో సమానంగా గిరిజనులు కూడా అభివృద్ధి చెందాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. జిల్లాలోని గిరిజన హాస్టళ్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో పాటు సీఎస్సార్ ఫండ్స్ కూడా కేటాయించి ఆయా వసతి గృహాల్లో సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకుని సమాజానికి ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన సలహా మండలి సభ్యుడు సోమ్లా నాయక్, అర్బన్ ఇన్‌ఫ్రా డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కాలే నాయక్, జిల్లా విజిలెన్స్ మానటరింగ్ కమిటీ మెంబర్ శ్రీనివాసులు నాయక్, డివిజన్ విజిలెన్స్ మానిటరీ కమిటీ మెంబర్ ఉమాశంకర్, గిరిజన సంక్షేమ మండలి సభ్యుడు హరిలాల్ నాయక్ పాల్గొని ప్రసంగించారు.



నృత్యం చేస్తున్న విద్యార్థులు

### సాయి కీర్తి.. సాంస్కృతిక దీప్తి

- ప్రశాంతి నిలయంలో తెలంగాణ భక్తుల సాంస్కృతిక కార్యక్రమాలు



'దివ్య ప్రణాళిక' పేరుతో చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన

**ప్రశాంతి నిలయం:** సత్యసాయి కీర్తిని వివరిస్తూ తెలంగాణ భక్తులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తకోటిని ఆధ్యాత్మిక లోకానికి తీసుకెళ్లాయి. తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని చాటుతూ చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన తెలంగాణ సత్యసాయి భక్తులు శనివారం సత్యసాయి సన్నిధిలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం సత్యసాయి సూక్తులు, బోధనలను వివరిస్తూ 'పద్య సూక్తులు' పేరుతో నృత్యరూపకం నిర్వహించారు. చక్కటి నృత్య భంగిమలతో భక్తులను ఆకట్టుకున్నారు. సాయంత్రం 'దివ్య ప్రణాళిక' పేరుతో ఆధ్యాత్మిక భక్తిరస నాటిక నిర్వహించారు. సత్యసాయి జీవిత చరిత్ర, బోధనలు, సేవా కార్యక్రమాలు తదితర అంశాలను ప్రస్తావిస్తూ నిర్వహించిన నాటిక భక్తుల మదిని మురిపించింది.

### నెట్టికంటుడి సేవలో ఉప లోకాయుక్త



ఆలయంలో ప్రదక్షిణ చేస్తున్న ఉప లోకాయుక్త

**గుంతకల్లు రూరల్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప లోకాయుక్త పి.రజని శనివారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి వారిని దర్శించుకున్నారు. ఆమెకు అధికారులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు ఉప లోకాయుక్త రజనికి స్వామివారి తీర్థప్రసాదాలు, పట్టు వస్త్రాలు అందజేశారు.

# దారుణాలు

- ధర్మవరానికి చెందిన చేనేత కార్మికుడు రమణపై వడ్డీ వ్యాపారులు దాడి చేశారు. ఇంట్లో కుటుంబీకుల ఎదుటే విచక్షణారహితంగా కొట్టారు. రమణ వ్యక్తిగత అవసరం నిమిత్తం వడ్డీ వ్యాపారి వద్ద రూ.6 లక్షలు అప్పు తీసుకోగా, ఇందుకు రూ.100కు రూ.10 చొప్పున నెలకు రూ.60 వేలు చెల్లించేవాడు. అయితే ఆర్థిక ఇబ్బందులతో మూడు నెలలుగా వడ్డీ చెల్లించలేకపోయాడు. దీంతో వడ్డీ వ్యాపారి అనుచరులతో ఇంటికే వచ్చి దాడి చేశారు.
- చిలమత్తూరు మండలం లాలేపల్లిలో ఇటీవల 'ఫైవ్ స్టార్' ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు రుణ గ్రహీత ఇంటికి వెళ్లి దౌర్జన్యం చేశారు. ఒక్క నెల కంతు చెల్లించనందుకే ఏకంగా దాడి చేసి గాయపరిచారు. సెల్‌ఫోన్‌తో పాటు నగదు లాక్కొని వెళ్లారు.
- చిలమత్తూరు మండలం పలగలపల్లికి చెందిన ఓ వ్యక్తి గోరంట్లలోని ఓ మైక్రోఫైనాన్స్ సంస్థ నుంచి రూ.50 వేల రుణం తీసుకున్నాడు. 15 రోజులకు ఒకసారి కంతు కట్టించుకుంటూ ఆరు నెలల్లోనే రూ.లక్ష వసూలు చేశారు. ఒక కంతు చెల్లించకపోయినా రౌడీ మూకలను వెంట బెట్టుకుని వచ్చి ఇబ్బందులకు గురిచేసి వేధించేవారు. దీంతో రుణగ్రహీత మరో చోట అప్పు చేసి మైక్రో ఫైనాన్స్ వద్ద తీసుకున్న రుణం వడ్డీతో సహా చెల్లించాడు.

... ఇలా నిరుపేదల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకుంటున్న వడ్డీ వ్యాపారులు, ఫైనాన్స్ సంస్థలు వారి రెక్కల కష్టాన్ని దోచుకుంటున్నాయి. ఒక్క నెల కంతు చెల్లించకపోయినా దౌర్జన్యాలకు దిగుతున్నాయి. ఎవరైనా పోలీసు స్టేషన్‌కు వెళ్లినా... పోలీసులు కూడా 'సెటిల్' చేసుకో అంటూ ఉచిత సలహా ఇస్తున్నారని బాధితులు వాపోతున్నారు. దీంతో జిల్లాలో వడ్డీ వ్యాపారులతో పాటు ఫైనాన్స్ కంపెనీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి.




**మళ్లీ మొదలైన మైక్రో ఫైనాన్స్ కంపెనీల ఆగడాలు**

- కంతులు ఆలస్యమైతే వేధింపులు
- ఆర్‌బీఐ ఆదేశాలు బేఖాతరు
- జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో పెరిగిన దౌర్జన్యాలు
- నగదు బదిలీ పథకాలు ఆగిపోవడంతో పేదలకు ఆర్థిక కష్టాలు
- ఫైనాన్స్ సంస్థలను ఆశ్రయిస్తూ ఊబిలోకి దిగుతున్న వైనం

**చిలమత్తూరు:** వడ్డీ వ్యాపారులు, మైక్రో ఫైనాన్స్ కంపెనీల ఆగడాలు మళ్లీ మొదలయ్యాయి. గత ప్రభుత్వం కఠినంగా వ్యవహరించడం..ఆర్బీఐ కూడా దృష్టి సారించడంతో అప్పట్లో తగ్గిన 'వడ్డీ' వేధింపులు మళ్లీ పుంజుకున్నాయి. అధిక వడ్డీలు, ప్రాసెసింగ్ ఫీజుల పేరుతో తీసుకున్న రుణంలో 30 నుంచి 40 శాతం కోతపెట్టి రుణానికి మించి ప్రజల రక్తాన్ని పీల్చి పిప్పి చేస్తున్నారు. ఒక్క రోజు ఆలస్యమైనా... రికవరీ ఏజెంట్లు ఇళ్ల వద్దకే వచ్చి వేధింపులకు గురిచేసే సంస్కృతికి తెరతీశారు. దీంతో అవమానాలు భరించలేక రుణగ్రహీతలు ఆత్మహత్యాయత్నాలకు పాల్పడుతున్నారు.

**అమాయకులు, రైతులే లక్ష్యంగా రుణాలు**

హిందూపురంతో పాటు జిల్లా వ్యాప్తంగా పదుల సంఖ్యలో అధికారిక, అనధికారిక మైక్రో ఫైనాన్స్ కంపెనీలున్నాయి. అలాగే ఊరూరా వడ్డీ వ్యాపారులు దుకాణాలు తెరిచారు. వీరెవరికీ ఎలాంటి అనుమతులు ఉండవు. వీరంతా అమాయకులు, రైతులు, చిరు ఉద్యోగులను లక్ష్యంగా చేసుకుని వారివద్దకే వెళ్లి రుణాలు ఇస్తారు. ఆ తర్వాత వసూళ్లలో తమ ప్రతాపం చూపిస్తూ వేధింపులకు గురిచేస్తున్నారు.

**కంతులు ఆలస్యమైతే వేధింపులు**

మైక్రో ఫైనాన్స్ కంపెనీలు, లోన్ యాప్స్ నిర్వాహకులు, వడ్డీ వ్యాపారులు..ఇలా ఎవరైనా సరే... కంతు చెల్లించడం ఒక్క రోజు ఆలస్యమైతే చాలు వేధించడం ప్రారంభిస్తారు. అనుమతుల తీసుకున్న మైక్రో ఫైనాన్స్ కంపెనీలు కూడా ఆర్బీఐ నిబంధనలన్నీ తుంగలో తొక్కుతున్నాయి. ఫోన్‌కు స్పందించక పోతే ఆ మరుసటి రోజు నేరుగా ఇంటి వద్దే ప్రత్యక్షమవుతారు. కాస్త సమయం ఇవ్వమని వేడుకున్నా.. కనికరించకుండా అవమానించడం, బలవంతంగా వస్తువులు, సెల్‌ఫోన్లు, నగదు లాక్కోవడం పరిపాటిగా మారిపోయింది.

**నగదు బదిలీ ఆగిపోవడంతో..**

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వివిధ పథకాల కింద డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ద్వారా పేదలకు ఆర్థిక ప్రయోజనం దక్కేది. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరాక నగదు బదిలీ పథకాలన్నీ ఆగిపోగా...పేదల ఆర్థిక పరిస్థితులు చిన్నాభిన్నమయ్యాయి. ముఖ్యంగా రైతులు పంటల పెట్టుబడి కోసం, పిల్లల చదువుల కోసం 'ప్రైవేటు'గా అప్పులు చేస్తున్నారు. చివరకు లోన్లు కట్టలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

**కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లోనే అధికం**

రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లోని వారే ఇలా ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలు, మైక్రో ఫైనాన్స్ సంస్థలు, వడ్డీ వ్యాపారుల వద్ద ఎక్కువగా రుణాలు తీసుకుంటున్నారు. ఇటు ఆంధ్రప్రదేశ్‌లోనూ, అటు కర్ణాటకలోనూ రుణాలను పొందుతున్నారు. పంటల కోసమనో, ఇతరత్రా అవసరాలతో లోన్లు పొందుతున్నారు. తీసుకున్న రుణాలను తీర్చే క్రమంలో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాలో హిందూపురం, కదిరి డివిజన్, మడకశిర ప్రాంతాల్లో 'ప్రైవేటు' లోన్‌లు ఎక్కువగా తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.

### పేదల రక్తాన్ని జలగల్లా తాగేస్తున్నారు



మైక్రో ఫైనాన్స్ కంపెనీలు రైతులను, అమాయకులను లక్ష్యంగా చేసుకొని వారికి రుణాలు ఇచ్చి రూ.20 వడ్డీతో వసూళ్లు చేస్తున్నారు. ధర్మవరం ఘటన కూడా ఒక ఉదాహరణ. ఏడాదిగా మైక్రోఫైనాన్స్ సంస్థలు రెచ్చిపోతున్నాయి. నిబంధనలేవీ పాటించకుండా రైతుల నెత్తిన అప్పుల కుప్ప పెడుతూ వేధిస్తున్నారు. ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం మైక్రో ఫైనాన్స్ సంస్థలపై దృష్టి సారించి వేధింపులకు గురిచేసే సంస్థలపై చర్యలు తీసుకోవాలి.

– ఫిరంగి ప్రవీణ్‌కుమార్, జిల్లా కార్యదర్శి, వ్యవసాయ కార్మికసంఘం

### లోన్ యాప్స్ వేధింపులూ అధికమే....

ఆన్‌లైన్ ద్వారా రుణాలు పొందే వారి పరిస్థితి మరీ దారుణంగా ఉంటోంది. లోన్ యాప్స్ ద్వారా నిమిషానికి ఒకసారి రుణం ఇస్తామంటూ మెసేజ్‌లు పంపడం... ఏమాత్రం నిబంధనలు పాటించకుండానే లోన్లు మంజూరు చేస్తున్నాయి. ఈ లోన్ యాప్స్ బారిన ఎక్కువగా యువత పడుతున్నట్లు తెలుస్తోంది. బెట్టింగ్ రాయుళ్లు, ఇతర వ్యసన పరులు ఈ యాప్స్ ద్వారా ఎక్కువగా లోన్లు తీసుకుంటున్నారు. సమయానికి కంతు చెల్లించకపోతే యాప్స్ నిర్వాహకులు ఫొటోలు మార్ఫింగ్ చేసి స్నేహితులు, బంధువుల నంబర్లకు పంపుతున్నారు. లోన్ యాప్స్ ద్వారా రుణాలు పొందవద్దని ప్రభుత్వం, ఆర్బీఐ హెచ్చరించినా ప్రయోజనం లేకపోతోంది.

# నిరుపేదల 'పట్ట'కొట్టారు!

- పెనుకొండ జగనన్న కాలనీపై 'కూటమి' నేతల కన్ను
- 64 మంది పేదల పట్టాలు రద్దు
- కొత్తగా తమ అనుకూలురకు ఇంటి స్థలాలు
- లబోదిబోమంటున్న లబ్ధిదారులు

నిరుపేదలకు సొంతిల్లు కల లాంటింది. జీవిత కాలంలో తమకంటూ ఓ గూడు ఉండాలనుకుంటున్నారు. ఇందుకోసం జీవితకాలం కష్టపడతారు. అలాంటి పేదల సొంతింటి కలను కూటమి సర్కార్ చెరిపి వేసింది. రాష్ట్రంలో ఇళ్లులేని వారే ఉండకూడదని అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇచ్చిన పట్టాలు రద్దు చేసి తమ అనుయాయులకు కొత్తగా పట్టాలిచ్చింది. దీంతో పట్టాలు కోల్పోయిన వారంతా ఆందోళనకు సిద్ధమయ్యారు.

**పెనుకొండ:** నిరుపేదల సొంతింటి కల నెరవేర్చేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జగనన్న కాలనీల పేరుతో ఏకంగా ఊర్లే నిర్మించింది. లేఅవుట్లు వేసి మౌలిక సదుపాయాలు కల్పించి ఆయా కాలనీల్లో నిరుపేదలకు పట్టాలిచ్చింది. ఇలా పెనుకొండ పట్టణంలోని 228–2, 262, 263 సర్వేనంబర్లలో 25.15 ఎకరాల్లో జగనన్న లేఅవుట్ వేసి 2019లో వందలాది మంది నిరుపేదలకు పట్టాలిచ్చి వారి సొంతింటి కలను సాకారం చేసేందుకు అడుగులు వేసింది. అయితే ఇలా పట్టాలు పొందిన వారిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన 64 మంది ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఇళ్లు నిర్మించుకోలేకపోయారు. దీన్ని తమకు అనుకూలంగా మలుచుకున్న కూటమి నేతలు ఇప్పుడా 64 మంది పట్టాలు రద్దు చేసి తమకు అనుకూలురైన వారికి కొత్తగా పట్టాలిచ్చారు. కొత్తగా పట్టాలు పొందిన వారు ఇప్పటికే పూర్తిగా అభివృద్ధి చెందిన జగనన్న లేఅవుట్‌లో ఆగమేఘాల మీద ఇళ్ల నిర్మాణం చేపట్టారు.

**స్థానికేతరులకూ పట్టాలు..**

ప్రస్తుతం రద్దు చేసిన ఇంటి పట్టాల స్థానంలో పెనుకొండ, సోమందేపల్లి, రొద్దం, పరిగి మండలాలకు చెందిన కూటమి నాయకులకు పట్టాలు ఇచ్చినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇల్లులేని తమకు జగనన్న ప్రభుత్వంలో స్థలాలు ఇస్తే... నేడు కూటమి ప్రభుత్వం అన్యాయం చేయడం దారుణమని బాధితులు వాపోతున్నారు. తమకు జరిగిన అన్యాయంపై బాధితులు ఆందోళనకు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే జగనన్న కాలనీ వద్ద రెండు రోజులుగా బాధితులు పనులను అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్నా... ఎవరూ పట్టించుకోవడం లేదు.



ఇంటి నిర్మాణం చేపట్టిన నూతనంగా పట్టా పొందిన వ్యక్తి



స్థలం చదును చేసిన కూటమి నాయకుడు

**అన్యాయం చేయొద్దంటూ వేడుకోలు**

తామంతా నిరుపేదలమని, ఆర్థిక ఇబ్బందుల వల్లే ఇళ్లు నిర్మించుకోలేక పోయామని పట్టాలు రద్దయిన వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాడుగ ఇళ్లలో ఉంటూ పడరాని పాట్లు పడుతున్నామంటున్నారు. కాస్త సమయం ఇస్తే ఇళ్ల నిర్మాణాలు చేపడతామంటున్నారు. కొందరు నాయకులు తమకు అనుకూలురైన వారికి పట్టాలు ఇప్పించేందుకు తమ జీవితాలను నాశనం చేస్తున్నారని మండిపడుతున్నారు.

**రద్దుకు నివేదించాం**

జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణం చేపట్టని వారికి పలుమార్లు నోటీసులు ఇచ్చాం. అయినా చాలా మంది ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించలేదు. అందువల్లే అలాంటి వారి పట్టాలు రద్దు చేయాలని రెవెన్యూ అధికారులకు లెటర్ ఇచ్చాం. ఆ మేరకు రెవెన్యూ అధికారులు పట్టాలు రద్దు చేశారు.

– శ్రీనాథ్, హౌసింగ్ ఏఈ, పెనుకొండ

**నాకు తెలియదు**

నేను ఇక్కడ చార్జ్ తీసుకుని రోజులే అయ్యింది. నేను వచ్చినప్పటి నుంచి ఒక్క పట్టా కూడా రద్దు చేయలేదు. ఇది అంతకుముందు జరిగిన విషయం. మరోసారి పూర్తి స్థాయిలో పరిశీలించి విషయం తెలుసుకుంటా.

– స్వాతి, తహసీల్దార్, పెనుకొండ

# కరెంటు కోసం రోడ్డెక్కిన రైతన్న



మహమ్మదాబాద్ కూడలిలో ధర్నా చేస్తున్న రైతులు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న రైతులు

- వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఆందోళన

**ఓడీచెరువు (అమడగూరు):** ఖరీఫ్ పంటలు ఎండముఖం పట్టాయి. బోర్ల కింద ఉన్న పంటలైనా చేతికందుతాయనుకుంటే నిత్యం విద్యుత్‌తో సమస్య. దీంతో బోర్లు సరిగా పనిచేయక కళ్లముందే పంటలు ఎండిపోతున్నాయి. ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా విద్యుత్ అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులు రోడ్డెక్కారు. శనివారం అమడగూరు మండల పరిధిలోని మహమ్మదాబాద్ మూడు రోడ్ల కూడలిలో ధర్నా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మిగతా పార్టీల నేతలూ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జయప్ప మాట్లాడుతూ.. ప్రకృతికి ఎదురొడ్డి రైతులు పంటలు పండిస్తుంటే... విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో పనిచేస్తున్న లైన్‌మెన్ ఎప్పుడూ అందుబాటులో లేకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడన్నారు. ఇక కొత్తగా బోర్లు వేసిన రైతులు ట్రాన్స్‌ఫార్మర్ల కోసం దరఖాస్తు చేసి డబ్బులు కట్టి నెలలు గడుస్తున్నా.. మంజూరు చేయడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతుల సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో నిరాహార దీక్ష చేసేందుకు కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న కదిరి ట్రాన్స్‌కో ఏడీ ఓబులేసు అక్కడికి చేరుకుని రైతులతో చర్చించారు. సమస్యకు సత్వర పరిష్కారం చూపిస్తానని హామీ ఇవ్వడంతో రైతులు వెనుదిరిగారు. కార్యక్రమంలో భారీ సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు

- ఒక్కరోజే 746.4 మి.మీ వర్షపాతం నమోదు



సుబ్బరాయనిపల్లి వద్ద పొలంలో నిలిచిన వర్షపునీరు



పుట్టపర్తి వద్ద వర్షానికి నేలవాలిన బంతి పూల చెట్లు

**పుట్టపర్తి అర్బన్:** వారం రోజులుగా మోస్తరు వర్షాలతో పలకరించిన వరుణుడు శుక్రవారం రాత్రి నుంచి విరుచుకుపడ్డాడు. శనివారం ఉదయం వరకూ జిల్లా అంతటినీ విడతల వారీగా తడిపేశాడు. దీంతో జిల్లా పరిధిలో ఒక్కరోజే 746.4 మీ.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. అత్యధికంగా అమరాపురం మండలంలో 68.8 మి.మీ, తాడిమర్రి మండలంలో 59.4 మి.మీ, కొత్తచెరువు 56 మి.మీ మేర వర్షం కురిసిందన్నారు. అలాగే ధర్మవరం మండలంలో 52.6 మి.మీ, హిందూపురం 47.8, కనగానపల్లి 47.6, రొద్దం 46.2, చెన్నేకొత్తపల్లి 45.8, బత్తలపల్లి 43.4, పరిగి 35.6, ముదిగుబ్బ 22.6, గోరంట్ల 21.4, లేపాక్షి 20, అగళి 19.6, రొళ్ల 16.4, సోమందేపల్లి 16.2, కదిరి 15.0, గుడిబండ 14.2, తలుపుల 13.2, పుట్టపర్తి 12.8, బుక్కపట్నం 10.8, మడకశిర 10, అమడగూరు 8.4, ఎన్‌పీకుంట 8.2, చిలమత్తూరు 7.2, రామగిరి 6.8, నల్లమాడ 6.2, పెనుకొండ 5.6, గాండ్లపెంట 2.8, ఓడీచెరువు 2.2, తనకల్లు 2, నల్లచెరువు మండలంలో 1.6 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వెల్లడించారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో వంకలు పారుతున్నాయి. అక్కడక్కడా ఉద్యాన పంటలతో పాటు బంతి, చామంతి, ఉల్లి, మిరప పంటలకు కొంత మేర నష్టం జరిగినట్లు రైతులు చెబుతున్నారు.

## క్లుప్తంగా

### ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలి

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప



నాయకులతో కలిసి మాట్లాడుతున్న సమన్వయకర్త ఈరలక్కప్ప

మడకశిరరూరల్: పులివెందుల జెడ్పీటీసీ స్థానం ఉప ఎన్నికలను ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప కోరారు. శనివారం కోతులగుట్టలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చౌటూరు మధుమతిరెడ్డి, నాయకులతో కలిసి సమన్వయకర్త మాట్లాడారు. ఉప ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, వైఎస్సార్‌సీపీ నేతలపై టీడీపీ గుండాలు ఓటమి భయంతో రాళ్లు, కట్టెలతో దాడులు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. దాడులకు పాల్పడిన టీడీపీ గుండాలపై పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పులివెందుల ప్రజలు జగనన్న గుండెల్లో ఉన్నారని, వైఎస్సార్‌సీపీకి ఓటు వేస్తారని తెలిపారు. ఈ నేపథ్యంలో అక్కడ పోలింగ్ బూత్‌లు మార్పు చేయడం వెనుక ప్రభుత్వ కుట్ర దాగి ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలను భయభ్రాంతులకు గురి చేసి గెలవాలని ప్రభుత్వం కుట్ర చేయడం అంటే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసినట్లేన్నారు. పోలీసులు కూడా శాంతిభద్రతలను కాపాడాల్సింది పోయి అధికార పార్టీ కోసం ఏకపక్షంగా విధులు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఎన్ని కుట్రలు చేసినా ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు జరిగితే వైఎస్సార్‌సీపీ జెండా ఎగరవేస్తుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆనందరంగారెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణ యాదవ్, మండల కన్వీనర్ రామిరెడ్డి, ఎంపీపీ కవిత, నాయకులు పాల్గొన్నారు.

### అప్పు విషయమై దంపతులపై దాడి

ధర్మవరం అర్బన్: అప్పుగా ఇచ్చిన సొమ్ము తిరిగి తనకు చెల్లించలేదని పట్టణంలోని వైఎస్సార్‌కాలనీకి చెందిన దాదా ఖలందర్, అరిఫ్రయాభాను దంపతులపై ఓ వ్యక్తి దాడి చేశాడు. టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దాదాఖలందర్ కనగానపల్లి మండలం కుర్లపల్లికి చెందిన ఇనయతుల్లాతో మార్చిలో రూ.10వేలు అప్పు తీసుకున్నాడు. తిరిగి అదే నెలలో ఇనయతుల్లా తల్లి అబీదాకు ఇచ్చేశారు. కానీ అబీదా తన కుమారుడు ఇనయతుల్లాకు ఆ విషయం చెప్పలేదు. దీంతో శనివారం వైఎస్సార్‌కాలనీకి వచ్చిన ఇనయతుల్లా డబ్బులు ఇవ్వాలని దాదా ఖలందర్ దంపతులపై దాడి చేసి గాయపరిచాడు. స్థానికులు వెంటనే వారిని కాపాడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం టూ టౌన్ పోలీసుస్టేషన్‌కు వచ్చి దాదాఖలందర్ ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# దిగజారి.. మసకబారి

- అనంతపురం నగరం సిండికేట్ నగర్‌లోని ఓ ఖాళీ స్థలంలోకి ఇటీవల కొంతమంది అక్రమంగా చొరబడ్డారు. హద్దు రాళ్లు పాతడం ప్రారంభించారు. స్థల యజమాని పోలీసులకు ఫిర్యాదు చేయగా అక్కడికి వచ్చిన వారు ప్రేక్షకుల్లా చూస్తూ ఉన్నారు తప్ప కబ్జారాయుళ్లను అదుపు చేయలేకపోయారు. దీంతో బాధితుడి ఆవేదన అంతా ఇంతా కాదు.
- అనంతపురం సప్తగిరి సర్కిల్ వద్ద 20 రోజుల క్రితం అడ్డదిడ్డంగా వెళ్తున్న ఓ కారును ట్రాఫిక్ పోలీసులు పట్టుకున్నారు. ఈ క్రమంలోనే కారు దిగిన డ్రైవర్.. పోలీసులపైనే చిందులు తొక్కాడు. దీనిపై టూటౌన్‌లో కేసు నమోదైంది. ఆ తర్వాత నిందితుడిని విడుదల చేశారు.
- అనంతపురంలో నిన్న డ్రంకన్ డ్రైవ్ తనిఖీలో పోలీసులు ఓ వ్యక్తిని పట్టుకున్నారు. కానీ ఆ వ్యక్తి ఖాకీలనే కొట్టబోయాడు. పోలీసులు సదరు మందుబాబును స్టేషన్‌కు తీసుకెళ్లబోతుండగా టీడీపీకి చెందిన ఓ నాయకుడు ఫోన్ చేసి విడిపించుకెళ్లారు. పోలీసులు ఎంతలా నిస్సహాయులుగా మారిపోయారో చెప్పే ఇలాంటి ఘటనలు నిత్యం ఉమ్మడి జిల్లాలో ఎక్కడో ఒక చోట జరుగుతూనే ఉన్నాయి.




**పోలీసుల హ్యాండ్సప్!**

- అస్సలు భయపడని భూ కబ్జారాయుళ్లు
- మద్యం తాగి ఖాకీలకే ఎదురు తిరుగుతున్న కొందరు..
- ఒక పార్టీకి, కొందరు నేతలకు వత్తాసు పలకడంతోనే దుస్థితి
- ఉమ్మడి అనంతపురం జిల్లాలో పోలీసుల పరిస్థితి అత్యంత దారుణంగా ఉందని విమర్శలు

సాక్షిప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో పోలీసుల ప్రతిష్ట మసకబారింది. ఇప్పటికే శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించడంతో పాటు మట్కా, గంజాయి, జూదం విచ్చలవిడి అయ్యాయి. టీడీపీకి, ఆ పార్టీకి చెందిన కొంతమందికి పోలీసులు వత్తాసు పలుకుతుండటంతో జనంలో పూర్తిగా పలుచన అయ్యారు. చాలాచోట్ల పోలీసులకే ఎదురు తిరుగుతున్న దుస్థితి నెలకొంది. ఇటీవల చోటుచేసుకున్న కొన్ని ఘటనలు పోలీసుల ఉనికినే ప్రశ్నార్థకం చేస్తున్నాయి. వారి పనితీరే వారికి శాపంగా మారింది.

**లెక్కే లేదు..**

జిల్లాలో పర్మిట్ రూములు, బెల్టుషాపులు ఇష్టారాజ్యంగా ఏర్పాటయ్యాయి. అన్ని హోటళ్లు, ధాబాల్లో మద్యం దొరుకుతోంది. చిన్న కాకా హోటల్‌కు వెళ్లినా మద్యం తాగుతున్న వారు కనిపిస్తున్నారు. ఈ క్రమంలో డ్రంకన్ డ్రైవ్‌లో పోలీసులకు పట్టుబడుతున్న మద్యం రాయుళ్లు ఖాకీలపైనే తిరగబడుతున్నారు. ఎక్కడపడితే అక్కడ మద్యపానానికి అనుమతులిచ్చి మళ్లీ తమను పట్టుకోవడమేంటని ప్రశ్నిస్తున్నారు. దీనికితోడు మద్యం తాగి డ్రంకన్ డ్రైవ్‌లో దొరికినా వెంటనే టీడీపీ నాయకులు ఫోన్ చేసి 'మావాణ్ని వదిలెయ్' అంటూ ఆదేశించగానే వదిలేస్తుండడంతో పోలీసులంటే లెక్కలేకుండా పోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**అలా వెళ్తారంతే..**

అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో రోజుకో కబ్జా, పూటకో ఆక్రమణ చందాన పరిస్థితి తయారైంది. స్వయానా పోలీసుస్టేషన్లలోనే కబ్జాదారులకు కుర్చీలేసి మరీ సెటిల్‌చేసి పంపిస్తున్నారు. బాధితులేమో విలపిస్తూ ఇంటికెళుతున్నారు. ఈ పరిస్థితుల్లో కబ్జా చేశారని ఎవరైనా బాధితులు ఫోన్ చేస్తే పోలీసులు చుట్టపుచూపుగా వెళ్లాల్సిందే కానీ కబ్జాదారులను శిక్షిస్తారని కాదని అరవిందనగర్‌కు చెందిన ఓ వ్యక్తి వాపోయాడు. రెండు జిల్లాల్లో పోలీసులున్నారని ఎవరూ అనుకోవడం లేదని, ఈ విషయం జనంలో బలంగా నాటుకుపోయిందని అంటున్నారు.

**హిందూపురంలో మరింత ఘోరం..**

హిందూపురం నియోజకవర్గంలో పోలీసుల పరిస్థితి మరీ అధ్వానంగా ఉందని కిందిస్థాయి పోలీసు సిబ్బంది అంటున్నారు. ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏలు ఏది చెబితే అదే చట్టం, న్యాయం అన్నట్టుందని వాపోతున్నారు. ఎంత పెద్ద ఆఫీసర్ అయినా వాళ్లకు 'బాసు' ఎవరైనా ఉన్నారంటే అది బాలకృష్ణ పీఏలే! తమకు నచ్చకపోతే అడిషనల్ ఎస్పీలనే శంకరగిరి మాన్యాలను పట్టించిన ఘనత వీరిది. కాబట్టి ఇక్కడ పోలీసులు ఉన్నా లేనట్టేనని తెలిసింది.

### శ్రావణ శనివారం.. భక్తజన సాగరం

పావగడ: స్థానిక శనీశ్వర స్వర్ణ దేవాలయంలో శనివారం పౌర్ణమి సందర్భంగా నిర్వహించిన తృతీయ శ్రావణ శనివారోత్సవ వేడుకలకు వేలాది మంది భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. గత రెండు శనివారాల కంటే ఈసారి అత్యధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. పలు సేవా సంస్థలు అన్న దాన కార్యక్రమాలు ఏర్పాటు చేశాయి. ఆలయ సమితి అధ్యక్షుడు అనిల్ కుమార్ తదితర పదాధికారులు, వలంటీర్లు, ఆలయ సిబ్బంది భక్తులకు సేవలందించారు. సీఐ సురేశ్ నేతృత్వంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

### రొళ్ల గురుకుల పాఠశాలలో అదనపు సీట్లు

అనంతపురం ఎడ్యుకేషన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం రొళ్ల పాఠశాలకు ఈ ఏడాది 5–10 తరగతులకు అదనపు సీట్లు మంజూరయ్యాయని గురుకుల పాఠశాలల ఉమ్మడి జిల్లా సమన్వయ అధికారి కె.జయలక్ష్మి తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. అదనపు సీట్లకు ఈ నెల 13న కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేస్తామని తెలిపారు. 6, 7, 9 తరగతులకు జూన్ 25న జరిగిన ప్రవేశ పరీక్ష మెరిట్ ఆధారంగా భర్తీ చేస్తామన్నారు. 5వ తరగతి సీట్లు బీఆర్ఏజీ సెట్ రాసిన విద్యార్థులకు మెరిట్ ద్వారా అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు. 9వ తరగతి ప్రవేశానికి పరీక్ష రాసిన విద్యార్థులు కొందరే ఉన్నారని వారు పోను తక్కిన సీట్లు, అలాగే 8, 10 తరగతుల సీట్లు తల్లిదండ్రుల నుంచి వచ్చిన వినతుల ద్వారా (గ్రీవెన్స్‌లో వచ్చిన అర్జీలు) వచ్చిన వారికి అవకాశం కల్పిస్తామని జయలక్ష్మి తెలిపారు. ఇవి అదనపు సీట్లు కాబట్టి స్కూల్‌లో చేరిన తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ బదిలీలు ఉండవని స్పష్టం చేశారు. మెరిట్ ఆధారంగా భర్తీ చేస్తామని ఎవరినీ నమ్మి మోసపోవద్దని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.

# ఖర్జూర సిరులు



ఎడారి పంట అయిన ఖర్జూరం కరువు నేల 'అనంత'లో సిరులు కురిపిస్తోంది. జిల్లాలో పలువురు రైతులు సంప్రదాయ పంటల సాగుతో పాటు ఆధునిక, ప్రత్యామ్నాయ పంటల సాగుపై మొగ్గు చూపుతున్నారు. ఈ క్రమంలో ప్రజలకు ఆరోగ్యం తెచ్చిపెట్టే ఖర్జూర పంటతో మంచి లాభాలు వస్తుండటంతో రైతులు దీనివైపు ఆసక్తి చూపుతున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా క్రమేణా సాగు విస్తీర్ణం పెరుగుతోంది.

- జిల్లాలో విస్తరిస్తున్న సాగు
- ఒకసారి సాగు చేస్తే 40 ఏళ్లపాటు దిగుబడులు
- ఖర్జూరాలకు మార్కెట్లో మంచి డిమాండ్
- ఆదర్శంగా నిలుస్తున్న రైతు రమణారెడ్డి

గార్లదిన్నె: జిల్లాలోని పలువురు రైతులు ఎప్పటికప్పుడు కొత్త తరహా పంటలు సాగు చేసి మంచి దిగుబడులతో దూసుకెళ్తున్నారు. అనంతపురం మండలం సిండికేట్‌నగర్‌కు చెందిన రైతు రమణారెడ్డి కూడా వినూత్న పంటల సాగుతో పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. గార్లదిన్నె మండలం మర్తాడు, కోటంక గ్రామాల్లోని తమ వ్యవసాయ భూముల్లో ఇప్పటికే డ్రాగన్ ఫ్రూట్ పంట పెట్టి సక్సెస్ అయిన ఈయన ఖర్జూర పంటను పెట్టారు. ఈయన 2019లో కన్యాకుమారి యాత్రకు వెళ్తూ తమిళనాడులో జాతీయ రహదారిపై ఖర్జూర పండ్లు అమ్మడం చూశారు. అక్కడ ఉన్న ఖర్జూర పండ్ల తోటలను గమనించి, ఈ ఎడారి పంట సాగు విధానం చూసి ఎలాగైనా మన నేలలో సాగు చేయాలని భావించారు. అలా అనుకున్నదే తడవు తమకు మర్తాడు, కోటంక గ్రామాల పరిధిలో ఉన్న ఆరు ఎకరాల విస్తీర్ణంలో టిష్యూ కల్చర్ విధానంలో ఖర్జూర పంట కూడా సాగు చేస్తున్నారు. అబూదాబి నుంచి బర్హీ ఎల్లో రకం మొక్క రూ.4500 చొప్పున 500 ఆడ, 50 మగ మొక్కలు కొనుగోలు చేశారు. ప్రతి 100 ఆడ మొక్కల్లో 10 మగ మొక్కలు ఉండేలా నాటారు. ఒక్కసారి మొక్క నాటితే 40 ఏళ్లపాటు పంట దిగుబడి వస్తుంది. సాధారణంగా ఫిబ్రవరిలో పూత దశ ఉంటుంది. పూత సమయంలో ఆడ, మగ మొక్కలు సంపర్కం చేస్తేనే ఖర్జూర పంట వస్తుంది. సంపర్కం జరగకపోతే ఈత కాయల తరహాలో మారిపోతాయి. సంపర్కం చేసే రోజు వర్షం వస్తే పంట దిగుబడి రాదు. అలాగే తోటలో మగ మొక్కలు పూత తక్కువ వస్తే, సంపర్కం కోసం మగ పూత కిలో రూ.12,500 వెచ్చించి కొనుగోలు చేయాల్సి ఉంటుంది. జూలై చివరిలో పంట కోత దశకు వస్తుంది.

**ఎకరాకు రూ.7లక్షల దాకా పెట్టుబడి..**

పంట సాగులో మొదటి నుంచి సేంద్రియ ఎరువులు, ఆవుపేడ, గంజు, కోడి, గొర్రెల పెంట వంటి హిట్ ఎరువులు, జీవామృతం అధికంగా వాడాలి. ఎకరాకు రూ.7 లక్షల దాకా పెట్టుబడి అవుతుంది. నీరు కూడా చాలా ఎక్కువ అవసరం. ఎకరాకు 100 మొక్కలు సాగు చేయవచ్చు. మూడు నుంచి నాలుగేళ్లకే దిగుబడి వస్తుంది. ఐదు సంవత్సరాల్లో ఒక చెట్టు వంద కేజీల ఖర్జూర కాయలు కాస్తుంది. ఒక ఎకరంలో 5 టన్నుల దిగుబడి వస్తుంది.

**సేంద్రియ ఎరువులతో తెగుళ్లకు చెక్..**

ఖర్జూర పంటలో రైనోబీటిల్, రెడ్‌విల్ వంటి తెగుళ్లు వస్తాయి. ఈ తెగుళ్లు సోకిన మొక్క కిందకు వాలిపోతుంది. సేంద్రియ ఎరువులు అధికంగా వాడి తెగుళ్లను నివారించవచ్చు. పంట సాగుకు చౌడు, నల్లరేగడి, ఇసుక లోమి నేలలు అనుకూలం.

**డిమాండ్ ఎక్కువే..**

ఖర్జూరకాయలకు డిమాండ్ ఎక్కువగానే ఉంది. విశాఖపట్నం, గుంటూరు, తణుకు, విజయవాడ, హైదరాబాద్ నుంచి వ్యాపారస్తులు తోట వద్దకే వచ్చి పసుపు పచ్చని ఖర్జూర కాయలు కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం హోల్‌సేల్ కిలో రూ.120తో, టన్ను రూ.1.20 లక్షల నుంచి రూ.1.30 లక్షల వరకు విక్రయిస్తున్నారు. ఇప్పటి వరకు రమణారెడ్డి 25 టన్నుల ఖర్జూర కాయలు విక్రయించారు. ఇంకా 10 టన్నులదాకా కాయలు చెట్ల మీద ఉన్నాయి.

**లాభదాయకమైన పంట**

మేము సిండికేట్ నగర్‌లో పట్టు చీరలు వ్యాపారం చేస్తూ జీవనం సాగించే వారం. కన్యాకుమారికి విహార యాత్రకు వెళ్లినప్పుడు ఎడారి మొక్క ఖర్జూర పంట విధానం చూశాను. మా వ్యవసాయ భూమిలో సాగు చేద్దామని ప్రయోగాత్మకంగా చేపట్టాను. మొదట్లో ఇబ్బంది పడిన క్రమేణా సాగులో మెలకువలు తెలుసుకొని మంచి దిగుబడులు సాధిస్తున్నాం. పంట పెట్టుబడి ఎక్కువైనా ఆశించిన దిగుబడి వస్తోంది. 30 నుంచి 40 ఏళ్లపాటు దిగుబడి వస్తుందని అంటున్నారు. ఇది మంచి లాభదాయకమైన పంటే.

– రమణారెడ్డి, రైతు, మర్తాడు



ఖర్జూర దిగుబడిని చూపుతున్న రైతు రమణారెడ్డి



# బాలికలు.. క్రీడల్లో మెరికలు



షాట్‌పుట్ సాధన చేస్తున్న విద్యార్థి



పరుగు పందెం సాధన చేస్తున్న దృశ్యం



జావెలిన్ త్రో సాధన చేస్తున్న దృశ్యం

- సత్తా చాటుతున్న గురుకుల పాఠశాల విద్యార్థినులు
- ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న పీడీ, పీఈటీలు

అమరాపురం: హలుకూరు సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల సంక్షేమ బాలికల పాఠశాలలో చదువుకుంటున్న పలువురు బాలికలు క్రీడల్లో రాణిస్తున్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో సత్తా చాటుతున్నారు. తాజాగా జూలై 28న అనంతపురం జిల్లా కేంద్రంలోని పీటీసీ క్రీడా మైదానంలో అండర్– 16, అండర్–18 బాలికల అథ్లెటిక్స్ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు తొమ్మిది మంది విద్యార్థులు షాట్‌పుట్, జావెలింగ్ త్రో, పరుగు పందెం పోటీలకు ఎంపికయ్యారు. మడకశిర, కళ్యాణదుర్గం, రాయదుర్గం, అనంతపురం, హిందూపురం తదితర ప్రాంతాలకు చెందిన బాలికలు గురుకుల పాఠశాలలో ఐదు నుంచి ఇంటర్ వరకు విద్యనభ్యసిస్తున్నారు. వీరికి ప్రిన్సిపాల్ అపర్ణ, పీడీ రోజా, పీఈటీ భాగ్యమ్మ, ఉపాధ్యాయుల సహకారంతో క్రీడల్లో తర్ఫీదు ఇస్తున్నారు. వీరి సాధన రోజూ వేకువజామునే ధ్యానంతో ప్రారంభమవుతుంది. 5.30 నుంచి 7 గంటల వరకు పీడీ, పీఈటీలు సంయుక్తంగా వివిధ ఆటల పోటీలు సాధన చేయిస్తున్నారు. అథ్లెటిక్స్ పోటీలైన పరుగు పందెం, 200 మీటర్లు, 400, 3000 మీటర్ల పరుగు పందెం, జావెలిన్ త్రో, షాట్‌పుట్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, తదితర పోటీలకు ఎంపిక చేసుకున్న వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తూ మెరికలుగా తీర్చిదిద్దుతున్నారు. ఇతర ప్రాంతాల్లో నిర్వహించే జిల్లా, జోనల్, రాష్ట్ర స్థాయి పోటీలకు పిల్లలను తీసుకెళ్లేందుకు తల్లిదండ్రుల నుంచి కూడా సహకారం, ప్రోత్సాహం ఉంటోంది.

**డీఎస్పీ అవుతా**



మాది పేద కుటుంబం. నేను అథ్లెటిక్స్ బాగా ఆడుతా. స్పోర్ట్స్ కోటా కింద డీఎస్పీ కావాలనుకుంటున్నా. తప్పకుండా సాధిస్తా. ప్రస్తుతం షాట్‌పుట్‌లో సాధన చేస్తున్నా. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యా.

–కోవెల, పదో తరగతి, గురుకుల పాఠశాల

**సాధనతోనే సాధ్యం**



నిరంతరం సాధన చేస్తే ఏ రంగంలోనైనా రాణించవచ్చు. మాది పేద కుటుంబం శెట్టూరు మండలం బోయబోరనపల్లి. నేను ప్రస్తుతం ఇంటర్ ఎంపీసీ చదువుతున్నా. 3000 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానంతో ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యా. పీడీ, పీఈటీల ప్రోత్సాహం బాగుంది.

– వరలక్ష్మి, విద్యార్థి, గురుకుల పాఠశాల, అమరాపురం

**ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్తున్నా**



నేను ఇంటర్ జూనియర్ బైపీసీ చదువుతున్నా. నాకు క్రీడలు, అథ్లెటిక్స్ అంటే చాలా ఇష్టం. దీంతో జిల్లా, రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొని సత్తా చాటుతున్నా. పరుగుపందెం పోటీలో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యా. ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్తున్నా.

– రశ్మీబాయి, విద్యార్థి, గురుకులపాఠశాల

**ప్రతిభను గుర్తించి.. శిక్షణ ఇస్తున్నాం**



మా పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులకు చదువుతో పాటు క్రీడల్లోనూ మంచి శిక్షణ ఇస్తున్నాం. ప్రతిభను గుర్తించి ఇష్టమైన క్రీడల్లో రాణించేలా తర్ఫీదు ఇస్తున్నాం. పీఈటీ, ప్రిన్సిపాల్ సహకారం బాగుంది. తల్లిదండ్రుల సహకారం చాలా అవసరం. మా పాఠశాల విద్యార్థినులు జిల్లా, జోనల్, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లోనూ రాణిస్తున్నారు.

–పీఈటీ భాగ్యమ్మ, పీడీ రోజా, గురుకుల పాఠశాల, అమరాపురం